ప్రజాశక్తి
గురువారం 22 డిసెంబరు 2022
5
శ్రీకాకుళం



నేడు జిల్లా మీదుగా చంద్రబాబు పర్యటన

శ్రీకాకుళం ప్రతినిధి: టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు విజయనగరం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా గురువారం జిల్లా మీదుగా రాజాం వెళ్లనున్నారు. ఉదయం 12 గంటల ప్రాంతంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు చంద్రబాబు చేరుకుంటున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం రెండు గంటలకు రణస్థలం చేరుకుంటారు. అక్కడ నుంచి ఎచ్చెర్ల మండలం చిలకపాలెం, పొందూరు మండలం లోలుగు, పొందూరు మీదుగా పర్యటన సాగనుంది. చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు ఆయా ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. పొందూరులో జిల్లాకు చెందిన టిడిపి నేతలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. అక్కడ నుంచి రాజాం నియోజకవర్గం పొగిరి చేరుకుని అక్కడ రైతులతో మాట్లాడనున్నారు. అనంతరం రాజాంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.



సీతారాంకు షాక్

- సిఎం జగన్ పుట్టినరోజు వేడుకల సాక్షిగా విభేదాలు బట్టబయలు
- ఆమదాలవలస నియోజకవర్గ కేంద్రంలో నాలుగు చోట్ల నిర్వహణ
- భారీ ర్యాలీ చేపట్టిన సువ్వారి గాంధీ గ్రూపు
- పతాక స్థాయికి చేరిన అసమ్మతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆమదాలవలస నియోజకవర్గ వైసిపిలో గ్రూపుల పోరు పతాక స్థాయికి చేరింది. సిఎం జగన్ పుట్టినరోజు వేడుకల సాక్షిగా పార్టీలో నెలకొన్న అసంతృప్తి బట్టబయలైంది. నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వ్యతిరేకంగా బుధవారం మూడు చోట్ల వేడుకలు నిర్వహించడం గ్రూపుల పోరుకు అద్దంపడుతోంది. ప్రధానంగా నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ నిర్వహించిన భారీ ర్యాలీ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ర్యాలీలో నాలుగు మండలాల నుంచి వేలాది మంది తరలిరావడంతో తమ్మినేని గ్రూపుకు మింగుడు పడడం లేదు. నియోజకవర్గంలో అసంతృప్తి, గ్రూపుల పోరు ఉన్నా అది ఈ స్థాయిలో ఉంటుందని ఊహించని తమ్మినేని వర్గీయులకు ర్యాలీ విజయవంతం కావడంతో మింగుడు పడడం లేదు.

2019 సాధారణ ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్యేగా తమ్మినేని సీతారాం ఎన్నికయ్యారు. ఆ తర్వాత వైసిపి అధికారంలోకి రావడంతో ప్రభుత్వం ఆయనకు స్పీకర్ పదవిని కట్టబెట్టింది. ఎన్నికల్లో తమ్మినేని విజయం సాధించడంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ఆయన విజయంలో కీలకపాత్ర పోషించారు. పార్టీలో ఈ రకమైన ఐక్యత స్థానిక సంస్థల ఎన్నికల వరకు కొనసాగింది. ఎన్నికల అనంతరం అన్ని మండలాల్లోనూ అసమ్మతి మొదలైంది. ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో సొంత పార్టీ వారినే తమ్మినేని వర్గీయులు ఓడించారన్న ఆరోపణలతో నాయకులు ఒక్కొక్కరుగా సీతారాంకు దూరం కావడం మొదలు పెట్టారు. మండలాల్లో ఏ నాయకుడు ఎదగనీయకుండా సొంత పార్టీలోనే మరో వ్యక్తిని ప్రత్యర్థిగా రంగంలోకి దింపి తమను నిర్వీర్యం చేయడాన్ని పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. పార్టీ వ్యవహారాల్లో కుటుంబసభ్యుల తీవ్ర జోక్యం, ఆర్థిక వ్యవహారాలు నడపడాన్ని సహించలేకపోయారు. తమ్మినేని నిర్వహించే పార్టీ సమావేశాలు, కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు.

పొందూరు మండలానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు సువ్వారి గాంధీ సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించారు. పార్టీ అధిష్టానం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు టిక్కెట్ ఇవ్వడంతో ఆయన గెలుపు కోసం పనిచేశారు. తనకు తర్వాత ఎన్నికల్లోనైనా పక్కలో బల్లెంలా మారుతారన్న ఉద్దేశంతో ఆయన్ను అణగదొక్కేందుకు సీతారాం అడుగడుగునా ప్రయత్నించారని గాంధీ అనుయాయులు ఆరోపిస్తున్నారు. తమ్మినేనిపై అంతర్గతంగా అసంతృప్తి ఉన్నా, ఏనాడూ ఆయన బయటపడలేదు. ఎన్నికలకు మరో ఒకటిన్నర ఏళ్లు ఉండడంతో తన సత్తా చూపాలని నిర్ణయించారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను వేదికగా చేసుకుని తమ బలాన్ని నిరూపించేందుకు సిద్ధమయ్యారని ఆయన అనుయాయులు చెప్తున్నారు. తమ్మినేనికి వ్యతిరేకంగా భారీగా జన సమీకరణ చేయడంలో సువ్వారి గాంధీ చాలా నెట్‌వర్క్ చేశారని తెలుస్తోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సత్సంబంధాలు పెంచుకుని కేడర్‌ను తనవైపు మలుచుకున్నారని చర్చ నడుస్తోంది.

సువ్వారి వెనుక ఉన్నదెవరు?

పొందూరు మండలానికి చెందిన ఓ నాయకుడు ఏకంగా నియోజకవర్గ కేంద్రంలో భారీ నిర్వహించారంటే అతనికి ఎవరో భరోసా ఇచ్చి ఉండొచ్చన్న చర్చ నడుస్తోంది. ఒక నియోజకవర్గంలో పోటాపోటీ కార్యక్రమాలకు అధిష్టానం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు. నియోజకవర్గ కేంద్రంలోనే వేర్వేరు చోట్ల కార్యక్రమాలు నిర్వహించిన నాయకులపై పార్టీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. చర్యలు తీసుకోలేదంటే ఎవరో బలమైన నాయకుల మద్దతు వారికి ఉందని భావించవచ్చు. వైసిపి నాయకుడు సువ్వారి గాంధీ ఇటు రెవెన్యూ మంత్రి ధర్మాన, అటు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో వీటికి బలం చేకూరుస్తున్నాయి.

సువ్వారి ఆరోపణలు నిజమేనా?

ఆమదాలవలసలో నిర్వహించిన సిఎం జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సువ్వారి గాంధీ చేసిన ఆరోపణలు తమ్మినేనినుద్దేశించి చేసినవేనని నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. రాజకీయాలంటే వడ్డీ వ్యాపారం కాదని, సొంత లాభాల కోసం నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలను నట్టేట ముంచి ఆస్తులను కూడబెట్టుకున్న పద్ధతి కానే కాదంటూ విమర్శలు సంధించారు. భవిష్యత్‌లో ఆమదాలవలస నియోజకవర్గంలో గ్రూపులు, అవినీతి, బంధుప్రీతి, కమీషన్ కక్కుర్తి, కలెక్షన్లు, వెన్నుపోటు రాజకీయాలను రూపుమాపుతానని చెప్పడం ద్వారా అక్కడ ఆ పరిస్థితి ఉన్నట్లు తేటతెల్లమవుతోంది.

జగన్ జన్మదిన వేడుకల్లో మరో రెండు గ్రూపులు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మరో రెండు గ్రూపులు నిర్వహించాయి. వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలోని ఒక గ్రూప్ బొడ్డేపల్లిపేటలోని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించాయి. ఆమదాలవలసకు చెందిన మరో వైసిపి నాయకుడు కోట గోవిందరావు తనయుడు జక్కంత్ ఆమదాలవలసలోని రైతుబజారు వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. యువకులతో బైక్ ర్యాలీ చేపట్టి, అన్నదానం నిర్వహించారు.

అధికారికంగా నిర్వహించిన సభకు నాయకులు దూరం

ఆమదాలవలసలోని జూనియర్ కళాశాల ఆవరణలో అధికారికంగా నిర్వహించిన సిఎం జన్మదిన వేడుకల్లో సభాపతి తమ్మినేని సీతారాం పాల్గొని కేక్ కట్ చేశారు. జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, సచివాలయాల సిబ్బంది, నాలుగు మండలాలకు చెందిన కొంతమంది నాయకులు మాత్రమే పాల్గొన్నారు. మెజార్టీ కేడర్ అక్కడి వేడుకలకు దూరంగా ఉన్నారు.


ఆమదాలవలస : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సువ్వారి గాంధీ

వేతన సవరణ చేయాలి

రైస్‌మిల్లు కార్మికుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

ప్రజాశక్తి - మందస

రైస్‌మిల్లు కార్మికులకు వేతన సవరణ చేయాలని రైస్‌మిల్లు కార్మికుల సంఘం (సిఐటియు) నాయకులు కె.కేశవరావు, కె.బాలకృష్ణ, టి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై కార్మికులు 12 రోజులుగా చేపట్టిన నిరసన దీక్షలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. గత ఒప్పందం పూర్తయినా యాజమాన్యాలు చర్చలకు సహకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునారని విమర్శించారు. అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, చట్ట ప్రకారం బోనస్, ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికుల ఆందోళనకు రైతుసంఘం నాయకులు ఎం.ధర్మారావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, కార్మికులు బి.దుర్యోధన, బి.వెంకటేశం, జయరాం, మధుసూదనరావు, అప్పన్న, గణేష్, కూర్మారావు, కృష్ణారావు, ధర్మారావు, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

జాయింట్ కలెక్టర్ నవీన్


సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - పొందూరు

అనర్హులైన ఓటర్లను తొలగించి పారదర్శకంగా ఓటర్ల జాబితాను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బూత్ లెవల్ అధికారులు, మండల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉండాల్సిన ఓటర్ల కంటే ఎక్కువ మంది జాబితాలో ఉన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి అనర్హులను తొలగించాలని ఆదేశించారు. ప్రధానంగా ఓటర్ల జాబితాలో పొందుపరిచిన వాటిలో మరణించిన వారిని, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారిని, డబుల్ ఎంట్రీలు, వివాహమై వేరే ప్రాంతానికి వెళ్లిపోయిన వారి ఓట్లను తొలగించాలని తెలిపారు. ఓటర్ల తొలగింపులో ఫిర్యాదులు వస్తే సంబంధిత బూత్ అధికారిదే బాధ్యతని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సవరమ్మ, తహశీల్దార్ ఎస్.రాంబాబు, ఎంపిడిఒ హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు చరమగీతం

- టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్
- తెలుగు శక్తి 'దండయాత్ర' సీడీ ఆవిష్కరణ


దండయాత్ర సిడి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో తెలుగు శక్తి దండయాత్ర సిడిని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు శక్తి రూపొందించిన పాట వైసిపి అరాచక పాలనలోని జనాన్ని చైతన్యం తీసుకొచ్చేందుకు దోహదపడుతుందన్నారు. ప్రజల్లో చైతన్యం నింపేందుకు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్ చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మూడున్నరేళ్లుగా అవినీతి, దోపిడీ పాలన సాగుతోందని విమర్శించారు. ఒక్క అవకాశమంటూ ఓటు అడిగి ప్రజలకు నరకం చూపిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏం సాధించారని జన్మదిన వేడుకలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం, ప్రజల డబ్బులతో జన్మదినోత్సవాలు నిర్వహించుకునే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. విజయనగరం జిల్లా రాజాం మండలం పొగిరిలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 22వ తేదీన వస్తున్న మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబుకు పొందూరులో ఘన స్వాగతం పలికేందుకు జిల్లా నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి రామ్ మాట్లాడుతూ జగన్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఆడియో వీడియో సిడిలను పాటల రూపంలో రూపొందించామని చెప్పారు. మొదటి సిడిని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో ఆవిష్కరించామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం గద్దె దిగితేనే, ఈ రాష్ట్రానికి పట్టిన సమస్యలు తొలగిపోతాయన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం మాటలు చెప్పడం తప్ప జగన్ చేసిందేమీ లేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు.

ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, బోడెపుడి దొరబాబు, డి.పరమేశ్వర, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, చిట్టి మోహన్, వెంకన్న యాదవ్, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, ప్రదాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ స్థాయికి విద్యా ప్రమాణాలు

- రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- జిల్లాలో 25,953 మందికి ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థికి ట్యాబ్‌ను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం / పలాస

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బి.ఆర్ అంబేద్కర్ కళావేదికలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో పలు పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే దేశాభివృద్ధి అని గుర్తించిన సిఎం జగన్ విద్యకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. నాడు-నేడు రెండు విడతల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రతి విద్యార్థికి కార్పొరేట్ విద్యను అందజేస్తున్నట్లు తెలిపారు. అందరికీ సమానమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ట్యాబ్‌లను ఉపయోగించుకుని ఇంటర్‌కు వచ్చేసరికి కంప్యూటర్లు, ట్యాబ్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటారన్నారు. ఎలాంటి పోటీ పరీక్షల్లోనైనా పాల్గొని విజయం సాధించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ట్యాబ్‌ల్లో బైజూస్ కంటెంట్ ఉంటుందని, విద్యార్థులు ట్యాబ్‌లు దుర్వినియోగం చేసుకోకుండా కంటెంట్‌ను మాత్రమే వాడాలని హితవు పలికారు. ముందుగా టీచర్లకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తే వారు అవగాహన చేసుకుని, విద్యార్థులకు చెప్పడానికి అవకాశం ఉంటుందన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యను అందించే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఒక్కో విద్యార్థికి రూ.15 వేల విలువ గల ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 25,953 ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో 22,982 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు, 2,971 మంది ఉపాధ్యాయులు ఉన్నట్లు వివరించారు. విద్యార్థులకు నూతన విద్యా విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సమగ్ర శిక్ష ఎపిసి జయప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌జెడి జ్యోతి, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి అప్పలరాజు

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జగన్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్ చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరంజక పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆదరణను జగన్ చూరగొంటున్నారని కొనియాడారు. అనంతరం యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బాలికలతో కలిసి మంత్రి థింసా నృత్యం చేశారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి.వి సతీష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కోత పూర్ణచంద్రరావు, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఎంపిడిఒ రమేష్ నాయుడు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నా కుమార్తెను ఇంటికి తీసుకురండి

కన్నీరుమున్నీరుగా విలపించిన కావ్య

ప్రజాశక్తి - పలాస


కావ్యను పరామర్శించిన గౌతు శిరీష

నా కుమార్తెను నా దగ్గరకు తీసుకురండి అని శంకు కావ్య కన్నీరుమున్నీరుగా విలపించింది. దుబాయ్‌లో భర్త వేధింపులు తాళలేక కావ్య ఇబ్బంది పడిన విషయం విధితమే. మంగళవారం అర్ధరాత్రి ఆమె దుబాయ్ నుంచి కన్నవారి ఇంటికి చేరుకుంది. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కావ్యను పరామర్శించారు. ఈ సందర్భంగా కావ్య తల్లిదండ్రులు మాట్లాడుతూ కావ్యకు పార్వతీపురానికి చెందిన శంఖ అవినాష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైందని, వివాహ సమయంలో 40 తులాల బంగారం, మూడు కేజీల వెండి ఇచ్చామన్నారు. అక్కడితో సంతృప్తి చెందక తరుచూ అత్తమామలతో కలిసి నిత్యం అదనపు కట్నం కోసం, ఇల్లు కొనివ్వాలంటూ వేధిస్తుండేవారని, వేధింపులు తట్టుకోలేక కావ్య ఏడాది కిందట పలాసలోని మా వద్దకు వచ్చేసిందన్నారు. పెద్ద మనుషులు జోక్యంతో కావ్య భర్త వద్దకు వెళ్లిపోయిందని, కొన్ని రోజులు పార్వతీపురంలో ఉండి, ఉద్యోగ రీత్యా అల్లుడు దుబాయ్‌లో స్థిరపడటంతో అక్కడికి వెళ్లిపోయిందని చెప్పారు. అక్కడా అవినాష్ మా కుమార్తెను వేధించడం మొదలుపెట్టాడని, జరిగిన విషయం తెలిసి తామే దుబాయ్ వెళ్లి కావ్య, మనుమరాలిని తీసుకొచ్చేందుకు వెళ్లామని చెప్పారు. తమతో కావ్యను, భవిష్యను పంపేందుకు అవినాష్ నిరాకరించాడని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న కావ్యను స్వదేశానికి రప్పించాలని కోరుతూ కళింగ వైశ్య సంఘం నాయకులు నిరసన తెలిపారు. తల్లిదండ్రుల వినతిమేరకు స్పందించిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మంత్రి సీదిరి అప్పలరాజు ఉన్నత స్థాయి అధికారులు, భారత దౌత్య అధికారులతో మాట్లాడారు. దుబాయ్‌లోని దౌత్య కార్యాలయ అధికారులు అవినాష్‌తో మాట్లాడటంతో కావ్యను ఒక్క దానినే ఇండియాకు పంపించాడు. ట్రావెల్ బ్యాన్ కేసు ఉండటంతో కుమార్తె భవిష్య అక్కడే ఉండిపోయింది. స్వదేశం వచ్చిన కావ్య తన కుమార్తెను తనకు ఇప్పించాలని వేడుకుంటోంది. నా భర్త ప్రతి రోజూ 300 కిలోమీటర్లు వెళ్లి ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, ఆ సమయంలో పాప ఆలనా పాలనా ఎవరు చూస్తారని బోరున రోదించింది. స్పందించిన శిరీష ఆన్‌లైన్‌లో తెలుగు అసోసియేషన్ సభ్యులతో మాట్లాడారు. కావ్య దుబాయ్‌లో న్యాయస్థానానికి ఆశ్రయిస్తే ఫలితం ఉంటుందని వారు సమాధానం ఇచ్చారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు వజ్జ బాబురావు, గురిటి సూర్యనారాయణ, తదితరులు ఉన్నారు.

జన హృదయాల్లో జగన్

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు
- 200 మంది రక్తదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం నగరంలోని టౌన్‌హాల్‌లో కేకును కట్ చేశారు. రెడ్‌క్రాస్ సమన్వయంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశిష్ట నాయకత్వానికి విస్పష్ట చిరునామా జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు జగన్ ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ప్రజా జీవితంలో ఎవరు బాగా పనిచేస్తే, వారే జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వ్యాఖ్యానించారు. తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాదిరిగానే జగన్ కూడా అపారమైన కీర్తి ప్రతిష్టలు పొందుతున్నారన్నారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు జగన్ పుట్టిన రోజును వేడుకగా నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచి సమాజంలో అసమానతలు తొలగించడానికి మూడున్నరేళ్ల పాలనలో జగన్ ఎంతో కృషి చేశారని చెప్పారు. వైసిపి శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకునిగా నియమితులైన మాజీ ఎంపీ డి.వి.జి శంకరరావును మంత్రి పరిచయం చేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 200 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, కార్పొరేషన్ల ఛైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, దానేటి శ్రీధర్, సాధు వైకుంఠరావు, అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


కేకును కట్ చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

24న జాతీయ వినియోగదారుల దినోత్సవం

శ్రీకాకుళం: జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెసి ఎం.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జిల్లాస్థాయి జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు అవగాహన కల్పించే ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు

జెసి ఎం.నవీన్

ప్రజాశక్తి - జలుమూరు


పౌరసరఫరాల గోదాము వద్ద బియ్యాన్ని పరిశీలిస్తున్న జెసి నవీన్

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్పష్టం చేశారు. బియ్యం నిల్వ చేసేందుకు మండలంలోని రావిపాడులో పౌర సరఫరాల గోదామును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసేందుకు మిల్లర్లకు అన్యాయం చేయబోమన్నారు. ఇరువురికీ న్యాయం చేకూరేలా ధాన్యం కొనుగోలు చేపడతామని స్పష్టం చేశారు. గతసారి మార్చి నెలాఖరు నాటికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని, ఈసారి మార్చి 15వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీలైనంత ఎక్కువగా ధాన్యం కొనుగోలు చేపడతామని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల వద్ద ధాన్యం తేమ శాతం పరీక్షలో నిర్లక్ష్యం వహించే టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. మిల్లర్లు తేమ శాతంలో తేడాలు చూపిస్తే వారిని జీవితకాలం బ్లాక్‌లిస్టులో పెడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వెంకటరమణ, పౌరసరఫరాల సంస్థ డిఎం పి.జయంతి, తహశీల్దార్ బి.సత్యం, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాస్, సిఎస్‌డిటి బి.గణేష్, గోదాము మేనేజర్ మహమ్మద్ జియా, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

తూకం వేసి ఇప్పించరూ..!

పౌర సరఫరాల గోదాము నుంచి డీలర్లకు సరఫరా చేస్తున్న సరుకుల్లో తరుగు వస్తున్నాయని డీలర్ల సంఘ మండల అధ్యక్షులు తండ్యాల కన్నయ్య జెసికి ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ డీలర్లు వినతిపత్రం అందజేశారు. గోదాము నుంచి డీలర్లకు పంపిస్తున్న బియ్యం బస్తాల్లో ప్రతి బస్తాకు రెండు కేజీల వరకు తరుగు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి డి.వెంకటరమణకు జెసి ఆదేశించారు.

వాడవాడలా సిఎం జగన్ జన్మదిన వేడుకలు


ఆమదాలవలస : కేకును కట్ చేస్తున్న స్పీకర్ సీతారాం


నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్


రణస్థలం : కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మెళియాపుట్టి: కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


సోంపేట: మాట్లాడుతున్న విజయ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆమదాలవలస నియోజకవర్గ కేంద్రంలో మూడు గ్రూపులు వేర్వేరుగా సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ముగ్గుల పోటీల విజేతలకు బహమతులను అందజేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన కరకవలస శోబావతి మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సందర్భంగా సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.70 లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, డిఎఫ్ఒ నిషాకుమారి, ఎఫ్ఆర్ఒ జగదీష్, డిఆర్ఒ జగదీష్, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, తహశీల్దార్ గణపతి, జిల్లా విద్య, మీడియా అధికారి పైడి వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే స్పీకర్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన సిఎం జన్మదిన వేడుకలు నిర్వహించారు.

పురపాలక సంఘం పరిధిలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజా సేవ కార్యాలయంలో సిఎం జగన్ జన్మదిన సందర్భంగా జూడో సంఘం జిల్లా అధ్యక్షులు, వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలను క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి వేసిన సైకత శిల్పం అక్కడికి వచ్చిన వారందరినీ ఆకర్షించింది.

వైసిపి నాయకులు కోట గోవిందరావు తనయుడు కోట జస్వంత్ ఆధ్వర్యాన పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం ఫ్లైఓవర్ దిగువన ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వరకు యువకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కోట శివ, ఊడికల రాజుబాబు, అన్నం నాయుడు, బుడుమూరు మన్మథరావు, సువ్వారి నర్సింగరావు పాల్గొన్నారు.

పోలాకి/నరసన్నపేట: నరసన్నపేట పార్టీ కార్యాలయంలో సిఎం జగన్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ మజ్జి రమణమ్మ, ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

రణస్థలం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సిఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అలాగే ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఇందులో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 119 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం ప్రసాద్, వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరులో సిఎం జగన్ జన్మదిన వేడుకలు రెండు గ్రూపులు నిర్వహించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పళ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. అలాగే స్థానిక రామలయంలో నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ఆధ్వర్యాన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, సర్పంచ్ కె.రత్నాలు, ఎంపిటిసిలు జి.రత్నకుమారి, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎఎంసి చైర్‌పర్సన్ గోగుల మాధవి, జి.వరప్రసాదరావు నాయుడు, కోయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య, ఎంఇఒ బి.శ్రీధర్, వి.శ్రీను, జి.ఆనంద్, వెంకటకృష్ణ, ఎల్.తిరుపతిరావు, నాగేంద్ర పాల్గొన్నారు.

బూర్జ : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిపి కె.దీప మొక్కలను నాటారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కె.నాగేశ్వరరావు, బూర్జ సర్పంచ్ వేగు అనురాధ, వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, ఎపిఒ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పొందూరు: సిఎం జగన్ జన్మదినం సందర్భంగా పొందూరులో విద్యార్థులకు నోట్‌పుస్తకాలను, పెన్నులను జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగడి లక్ష్మి, వైసిపి నాయకులు కె.రమణమూర్తి, కె.సూర్యారావు, కె.గిరిబాబు, బి.వెంకట కృష్ణారావు పాల్గొన్నారు. అలాగే కోటిపల్లి కూడలి నుంచి ఆమదాలవలస పట్టణం వరకూ వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ ఆధ్వర్యాన బైక్ ర్యాలీని నిర్వహించారు. అలాగే ఎన్ఆర్ఇజిఎస్ ఆధ్వర్యాన మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎంపిపి హరిహరరావు, ఎపిఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కవిటి: సిఎం జగన్ జన్మదిన సందర్భంగా కవిటి, సోంపేటలో ఉంటున్న పలువురు యాచకులు, అనాథలకు సచివాలయాల ఉద్యోగులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పొల్లాయి అశోక్, ఉప్పాడ జయకృష్ణ, లోళ్ల విజయ్, కొల్లి వాసు పాల్గొన్నారు.

కవిటి: జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ చింతామణి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం కవిటి బస్టాండ్ సెంటర్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పిరియా సాయిరాజ్, నర్తు రామారావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపిపి కడియాల పద్మ, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, దువ్వు కష్ణారెడ్డి, సర్పంచ్ పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం సిఎం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి నిమ్మన దాస్, టి.యశోద, మడ్డు రాజారావు, రౌతు విశ్వనాథం, వెంకన్న, టి.జోగారావు, భాస్కరరావు, కె.నెహ్రూ, ఢిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: బెల్లుపడలో గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరాలను పిరియా సాయిరాజ్ ప్రారంభించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలేసి, నివాళులర్పించారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. పుట్టిన రోజు కుకును కార్యకర్తలకు పంచిపెట్టారు. పురుషోత్తపురం పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నర్తు రామారావు, శ్యాంప్రసాద్‌రెడ్డి, పిలక రాజ్యలక్ష్మి, నర్తు నరేంద్ర యాదవ్, భారతి దివ్య, తదితరులు పాల్గొన్నారు.

పలాస: పలాస ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానిశంకర్, దువ్వాడ సోదరులు వేర్వేరుగా సిఎం జగన్ పుట్టన రోజు వేడుకలు నిర్వహించారు.కేసు కోసి పంచిపెట్టరు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపినీ చేశారు. కార్యక్రమంలో చిన్నంనాయుడు, గౌరి, మేగన, కూర్మారావుచ, గీతారాణి, మౌనిక, దువ్వాడ శ్రీధర్, వైసిపి పట్టణ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, నవీన్ చౌదరి, హేమాచలం, వినోద్, కాళి, రాజారావు, చంద్రమౌళి, అన్నాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, పాలిన శ్రీనివాసరావు జగన్ పుట్టినరోజు కేకును కోసి, పంచిపెట్టారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.హరినారాయణ, పి.ఉమామహేశ్వరరావు, పుక్కళ్ల గురయ్యానాయుడు, డి.రత్నం బాలరాజు, దువ్వాడ హేంబాబు చౌదరి, గోవిందరావు, సుశీల, ధర్మారావు తెలిపారు.

నందిగాం: ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్ ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, తిలక్ ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం పుట్టిన రోజు కేకును కృపారాణితో కలిసి కోశారు. తిలక్ అందజేసిన 400 దుప్పట్లను గురుకుల పాఠశాల విద్యార్థులకు అందజేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిపిలు శ్రీరామ్మూర్తి, ఆర్.మల్లయ్య, పి.వసంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండల కేంద్రంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, జోగి రాములమ్మ సిఎం పుట్టిన రోజు కేకు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. గోవిందపురంలో సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి సిఎం జగన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కె.లక్ష్మి, బుడ్డా మోహన్‌రెడ్డి ఎంపిడిఒ జి.ఉమాసుందరి, ఓపిఒ వాసునాయుడు పాల్గొన్నారు.

నౌపడ: మండలంలోని హనుమంతునాయుడుపేట వైసిపి కార్యాలయంలో జెడ్‌పిటిసి పి.వసంత్‌రెడ్డి, ఎంపిపి ఎం.రాజేశ్వరి ఆధ్వర్యాన కేకును కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మెగా వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.అప్పారావు, ఎన్.భీమారావు, కెల్లి గోవింద, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండల పరిషత్ ఆవరణలో ఎంపిపి ఆర్.ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి వెంకటరావు సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేకును కోసి పంచిపెట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలోరోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రామరావు, ఎస్.వినోద్, ఎం.ఆదినారాయణ, ఎన్.రాజశేఖర్, హనుమంతు గోవింద్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి సచివాలయంలో సిఎం పుట్టిన రోజు కేకును కోసి, పంచిపెట్టారు. అనంతరం ఊడికలపాడు పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు నెయ్యిల సురేష్, వానపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలో చల్లవానిపేట సచివాలయంలో ఎంపిపి వాన గోపి సిఎం పుట్టిన రోజు కేకును కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పాగోటి రాజప్పలనాయుడు, చిన్నాల మురళి, పి.విజయ్‌కుమార్, విఠల్‌రావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఎమ్మెల్యే రెడ్డి శాంతి సిఎం పుట్టిన రోజు కేకును కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం చాపర జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి ఎండయ్య, బాలరాజు, ఆదినారాయణ, ధనలక్ష్మి, ఎంఇఒ దేవేంధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.


నందిగాం : కేకును కట్ చేస్తున్న కృపారాణి


బూర్జ : మొక్కలు నాటుతున్న ఎంపిపి దీప


పొందూరు : మొక్కలు నాటుతున్న వైసిపి నాయకులు


కవిటి : భోజనం పార్సిల్‌ను అందిస్తున్న సచివాలయం సిబ్బంది

సువ్వారి గాంధీ బైక్ ర్యాలీ

ఆమదాలవలస : సిఎం జగన్ జన్మదినం సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ ఆధ్వర్యాన మండలంలోని వంజంగి వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి కృష్ణాపురం శివారులో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వరకూ కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. నియోజకవర్గంలో గ్రూపులు, అవినీతి, బంధుప్రీతి, కమిషన్ల కక్కుర్తి, కలెక్షన్లు, వెన్నుపోటు రాజకీయాలను రూపుమాపుతానన్నారు. రాజకీయాలంటే వడ్డీ వ్యాపారం కాదనిన సొంత లాభాల కోసం నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను నట్టేట ముంచి ఆస్తులను కూడబెట్టుకునే పద్ధతి కానేకాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజల ముందుకొచ్చానని, అందరూ తనను ఆదరించి అండగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ, పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, సువారి సత్యనారాయణ (ఢిల్లీ), సర్పంచ్ మొదలవలస నీలవేణి, మాజీ సర్పంచ్ యతిరాజుల జగన్నాథం పాల్గొన్నారు.


వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సువ్వారి గాంధీ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా కార్యవర్గ సభ్యులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం


ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాంలు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిశారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికలో ఏకగ్రీవమైన జిల్లా కార్యవర్గ సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఐదోసారి సాయిరాం జిల్లా అధ్యక్షునిగా, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై సీతారాం హర్షం వ్యక్తం చేస్తూ... అభినందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరుతోనే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకరిస్తానని హామీనిచ్చారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీ ని నాగ్ కూడా సాయిరాలను హత్తుకుని ఆత్మీయంగా అభినందించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో వారిలో జిల్లా, డౌన్ సంఘం నేతలు చల్లా శ్రీనివాసరావు, రాయి వేణుగోపాలరావు, బడగల పూర్ణచంద్రరావు, ఆర్.గోవిందసత్నాయక్, బొత్స శ్రీనివాసరావు, నవీన్, శ్రీరామ్‌కుమార్, భూపాలరావు, రత్నకుమార్, కె.రాజకుమారి, పాలవిత, నారా యమ్మ కుమారి ఉన్నారు.

ఎల్‌క్యూబ్‌కు 29 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎల్-క్యూబ్ సంస్థ రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రాంగణ ఉద్యోగ ఎంపికలో 2022-2023 విద్యాసంవత్సరంలో బిటెక్, ఎంబిఎ కోర్సులు పూర్తిచేసిన 29 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 29 మందిలో ఐదుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, 24 మంది బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్‌గా ఎంపికయ్యారని తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు కంపెనీ ఇవ్వనుందని చెప్పారు. పూనే, చెన్నైలో వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. వత్తిని దైవంగా భావించి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నాగేశ్వరరావు అభినందిస్తూ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఫినిషింగ్ స్కూల్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎన్.ఎస్ సంతోష్ కుమార్ల, హెచ్‌డిలు విద్యార్థులన ప్రశంసించారు.


విద్యార్థులను అభినందిస్తున్న నాగేశ్వరరావు, తదితరులు

కొండలు మింగేస్తున్నారు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి గెడ్డలు, వాగులు, డిపట్టా భూములు, కొండలను సైతం మంత్రులు, ఎమ్మెల్యే ఆక్రమించుకుంటున్నారని, పలాస నియోజకవర్గంలో కొండలు మాయం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో టిడిపి ఆధ్వర్యంలో బుధవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా గ్రామంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బజార్ వీధిలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ఎండగొట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మూడేళ్లలో ధరలు ఆకాశం కొట్టుకుంటున్నాయని, పన్నులు విపరీతంగా పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది పలాస, వజ్రపుకొత్తూరు మండలాల భూములకు వంశధార నీరు సరఫరా చేసారా? అని ప్రశ్నించారు. రైతులకు సాగునీరు అందించలేని పరిస్థితిలో మంత్రి అప్పలరాజు ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్ కుమార్, కార్యదర్శి దువ్వాడ సంతోష్ కుమార్, మాజీ ఎంపిటిసి గరుగు సింహాచలం, నీటి సంఘం నాయకులు ఆర్.సుధాకర్, వడ్డీ యాదగిరిదాలయ్య, యర్ర సిమ్మయ్య, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు పాల్గొన్నారు.


పలాస : పత్రాన్ని చూపిస్తున్న గౌతు శిరీష

ప్రాణం పోయినా సంతకం పెట్టను

మండలంలోని బ్రాహ్మణతర్ల జంగం వీధికి చెందిన షేక్ చాంద్ మాట్లాడుతూ తన భూమి 60 సెంట్లు బలవంతంగా వైసిపి నాయకులు తీసుకొనేందుకు చూస్తున్నరని శిరీష దృష్టికి తీసుకెళ్లారు. నా ప్రాణం పోయినా సంతకం పెట్టానని చెప్పారు. నాకు మీరే న్యాయం చేయాలని ఆమె వద్ద మొరపెట్టుకున్నాడు.

కోటబొమ్మాళి: మండడలంలోని రామయ్యపేటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ మాట్లాడుతూ రాష్ట్రం బాగుండాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వల్ల రాష్ట్రంలో అన్ని ధరలూ పెరిగిపోయాయని, ప్రజలు ఏం తిని, బతికే పరిస్థితులు లేవన్నారు. పన్నుల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. సైకిల్ పాలన రావాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తర్ర రామకృష్ణ, పట్ట సింహాచలం, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, కె.అప్పారావు, శ్రీనివాసరావు, ఆనందరావు, అప్పలరాజు, దేవాది సింహాద్రి, ఎల్.రాహుల్, లక్ష్మణ్‌రెడ్డి, నాగయ్యరెడ్డి, పూజారి శైలజ, రంగారావు, సునీల్ పాల్గొన్నారు.


చెరువులో చెత్త సంపద కేంద్రం నిర్మాణం


పునాదులు తీస్తున్న కూలీలు

పొందూరు: చెరువులు, వాగులు, గెడ్డ పోరంబోకు స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదంటూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఆ నిబంధనలను అధికారులు తుంగలోకి తొక్కుతున్నారు. చెరువు గర్భాల్లో చేపట్టిన నిర్మాణాలను తొలగించాల్సిన అధికారులే నియమ నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని కోటిపల్లిలో కుంటి చెరువు గర్భంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మానానికి రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు అనుమతులు ఇవ్వడంతో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మాణం పనులను చేపడుతున్నారు. గ్రామాల్లో తప్పనిసరిగా ఎస్‌డబ్ల్యుపిసి నిర్మాణం చేపట్టాలని జిల్లా అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అందుకు సరిపడా ప్రభుత్వ స్థలం లేక పోవడంతో స్థానిక రెవెన్యూ, సర్వే అధికారులు ఈ స్థలా న్ని కేటాయించారు. దీంతో అధికారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనిపై ఎపిఒ శ్రీనివాసరావును వివరణ కోరగా... తమకు అప్పగించిన స్థలంలోనే నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. తహశీల్దార్ ఎస్.రాంబాబును వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

పొందూరు: ఈ నెల 22న టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడు రాజాం పర్యటనను టిడిపి శ్రేణులు విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు కోరారు. రాజాంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నారని, అందులో భాగంగా మధ్యాహ్నం 3.45 గంటలకు స్థానిక అంబేద్కర్ కూడలిలో టిడిపి శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి రాజాం వరకూ భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


రామ్మోహనరావు

జి.సిగడాం : విజయనగరం జిల్లా రాజాంలో ఈ నెల 22న నిర్వహించనున్న ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటున్నారని, ఈ సభను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్ పిలుపునిచ్చారు. టిడిపి కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా రోడ్ షో నిర్వహిస్తారని, ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మండలంలోని టిడిపి బూత్ కన్వీనర్లు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మాజీ ప్రతినిధులు, మహిళలు, యువత పాల్గొవాలని కోరారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న రాజేష్

క్షతగాత్రునికి అండ

కవిటి: మండలంలోని శ్రీహరిపురానికి చెందిన క్షతగాత్రుడు జన్ని రఘుమనికి జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ అండగా నిలిచారు. రఘుమని కొబ్బరి చెట్ల నుంచి కొబ్బరి కాయలు తీస్తూ జీవనోపాధి పొందేవాడు. అయితే ఇటీవల కొబ్బరి కాయలు తీస్తుండగా కొబ్బరి చెట్టు పైనుంచి పడిపోయి అనారోగ్యానికి గురయ్యాడు. రెక్కాడితే గాని డొక్కాడని రఘుమని పరిస్థితి తెలుసుకున్న రాజేష్ బుధవారం గ్రామానికి చేరుకుని రాజేష్ సేవాదల్ పేరిట నెలకు సరిపడే నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో పృథ్వీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

నందిగాం: పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలని, జిల్లా పునశ్చరణ తరగతుల సమన్వయ అధికారి గ్రేస్ అన్నారు. బుధవారం అంబేద్కర్ బాలికల గురుకుల పా ఠశాల, కళాశాలలో తొమ్మిది గురకుల పాఠశాలల్లో పని చేస్తున్న 60 మంది ఫిజిన్స్, బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా బోధించాలని సూచించారు. అవసరమైతే స్టడీ మెటీరియల్ తయారు చేయాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్ఎం సుబ్రమణ్యం

చిన్నమ్మడుకు అభినందనలు

ఎచ్చెర్ల: స్టేట్ 41వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్-2022 ఇటీవల నెల్లూరులోని ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన మహిళల అథ్లెటిక్ పోటీలో చిలకపాలెం ఉన్నత పాఠశాల పిఇటి కోలక చిన్నమ్మడు మూడు బంగారు, రెండు రజిత పతకాలు సాధించి సత్తా చాటారు. 40 ప్లస్ వయసు కేటగిరిలో షార్ట్‌పుట్‌లో బంగారం, 4ఇంటు400 మీటర్ రిలే పరుగు పందెంలో బంగారం, 4ఇంటు100 మీటర్ రిలే పరుగు పందెంలో బంగారం, హేమర్ త్రో పోటీలో రజిత, 100 మీటర్ల పరుగు పందెంలో రజిత పథకాలు సాధించి సత్తాచాటారు. గతంలోనూ చిన్నమ్మడు అనేక రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలకపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమూరు సుబ్రహ్మణ్యం, సిబ్బంది దున్న సురేష్, పట్నాన నాగేంద్రరావు, చావలి శ్రీనివాస్, సీపాన ముకుందరావు, బొంతు రుక్మిణి, తమ్మినేని వెంకటలక్ష్మి, నాయన హరికృష్ణ, వాలంటీర్ ఉపాధ్యాయులు పి.అప్పలనాయుడు, పి.రాజకుమారి, పి.చిరంజీవి, బి.చిన్నారి అభినందించారు.

జీతాలు చెల్లించకుంటే సమ్మె

పలాస: రక్షిత తాగుచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు నెలలు గడుస్తున్నా జీతాలు చెల్లించక పోవడం దారుణమని, తక్షణమే జీతాలు చెల్లించాలని, లేని యెడల జిల్లా వ్యాప్తంగా కార్మికులు సమ్మె చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఐటియుసి గౌరవ అధ్యక్షులు చాపర వెంకటరమణ ప్రభుత్వానికి హెచ్చరించారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జిల్లా రక్షిత తాగునీటి కార్మిక సంఘం(ఎఐటియుసి) ఆధ్వర్యాన బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టులో కార్మికులకు 24 నెలలుగా జీతాలు లేక కుటుంబాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించాలని అధికారులకు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో 24 ఏళ్లుగా కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి ఎటువంటి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించడం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. తాగునీటి రక్షిత ప్రాజెక్టు సంఘం జిల్లా అధ్యక్షులు కె.నీలాచలం, కార్యదర్శి ఎం.వైకుంఠరావు, కిషోర్, పాపారావు, తులసి, కృష్ణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

వస్తు వినియోగంపై అవగాహన అవసరం


బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం హరిబాబు

ప్రజాశక్తి- నందిగాం

విద్యార్థులకు వస్తువు వినియోగంపై అవగాహన అవసరమని మండల విద్యాశాఖ అధికారి జి.నరసింహులు అన్నారు. బుధవారం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వై.హరిబాబు అధ్యక్షతన వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ సదస్సులో వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ ఎల్.వెంకటాచలం మాట్లాడారు. వినియోగదారులు నష్టపోయే సందర్భంలో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించే విధానాన్ని, వినియోగదారుల రక్షణ చట్టం, హక్కులు, బాధ్యతలను వివరించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వినియోగదారల కమిషన్‌లో కేసులు సమర్థవంతంగా నిర్వహించడం అనే అంశంపై జరిగిన పోటీల్లో ఇంగ్లీష్ మీడియంలో వైశాలి, ఎం.చైతన్యశ్రీ, తెలుగు మీడియంలో ఎస్.దీప్తి, ఎ.మోహిని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. డిబెటింగ్ ఇంగ్లీష్ మీడియంలో లోజీ చరణ్‌రాజు, ఎం.ప్రణీత్, తెలుగులో ఇ.భవాని, ఎం.హర్షిత వరుస రెండు స్థానాల్లో నిలిచారు. వీరికి వెంకటాచలం బహుమతులు అందించారు. కార్యక్రమంలో బలగ ఎర్రంన్నాయుడు, పద్మావతి, జి.రామునారాయణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: మార్కెట్లలో దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు కల్తీలపై అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర కమిటీ సభ్యుడు దువ్వాడ జనార్ధనరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైకుంఠరావు అధ్యక్షతన జాతీయ వినియోగదారుల దినోత్సవం వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు నాణ్యత, రసీదులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు ఫోరం క్లబ్ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాసరావు, సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపిటిసి రమణమ్మ, విద్యా కమిటీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండలం బెజ్జిపురంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి వెంకటరత్నం ప్రసాద్, వైస్ చైర్మన్ బస్వ దురుగుబాబు, పాలకవర్గ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రణస్థలం, జి.సిగడాం మండలాల ఎంపిపి ప్రతినిధులు పిన్నింటి సాయికుమార్, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసిలు టొంపల సీతారాం, కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు ఆహ్వానం

ప్రజాశక్తి- పలాస

విజయవాడలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు సాంస్కృతిక రంగ ప్రతినిధిగా, వక్తగా సదస్సుకు హాజరు కావాలని జానపద కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్‌కు మహాసభల నిర్వహణ కమిటీ వర్తమానం పంపింది. ఈ నెల 24న విజయవాడ రాజరాజ నరేంద్ర సభాప్రాంగణం నందమూరి తారక రామారావు వేదికపై సాహిత్యంలో సాంస్కృతిక రంగం అను అంశంపై మాట్లాడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కళలు, వాటి మునుగడ, ప్రభుత్వ సహకారం అంశంపై మాట్లాడతానని కుమార్‌నాయక్ తెలిపారు.

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఘటనపై విచారణ

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ కమిషనరు వేధింపులు తాళలేక శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శివలక్ష్మి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మున్సిపల్ ఉద్యోగులపై విశాఖపట్నం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ జి.నాగరాజు బుధవారం విచారణ చేపట్టారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను వేరువేరుగా కలిసి ఘటన జరిగిన రోజున ఏమి జరిగిందో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై రీజనల్ డైరెక్టర్ నాగరాజుకు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు ఆత్మహత్యకు యత్నించిన శివలక్ష్మిని పరామర్శించకుండా వెళ్లిపోవడం గమనార్హం.


మాట్లాడుతున్న గీత

15వ వార్డులో 'మాటామంతి'

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే మాట మంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డులో బుధవారం మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకుంటున్నామని అన్నారు. నిత్యవసరాల ధరలు కొండెక్కి కూర్చున్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళా పట్టణ అధ్యక్షులు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్ తమ్మినేని విద్యాసాగర్, టిడిపి నాయకులు పుట్రేపు ప్రసాదరావు, గండివలస త్రినాథరావు, అన్నెపు సత్యం, పాతిన వెంకటరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఈఆర్‌ఓ జయదేవి

డబుల్ ఎంట్రీల తొలగింపు

ఇఆర్‌ఓ జయదేవి

ప్రజాశక్తి - జలుమూరు

ఓటరు జాబితాలో ఉన్న డబుల్ ఎంట్రీలు, చనిపోయిన, మైగ్రేషన్, తదితర ఓట్లను తొలగించాలని ఈఆర్‌ఓ జి.జయదేవి అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇపి రేషియో ఎక్కువగా ఉందని, దీన్ని తగ్గించాలని అన్నారు. గతంలో జనాభా గణన 2011లో జరిగిందని, 2023 ప్రాప్తికి జనాభా లెక్కలు వేయాలన్నారు. ఫారం 6, 7లు జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 26వ తేదీలోపు పూర్తి చేయాలని బిఎల్‌ఒలను ఆదేశించారు. ఫారం-6 క్లైమ్‌రాని ఏ ఒక్క పోలింగ్ బూత్ కూడా ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఆమెతోపాటు తహశీల్దార్ బి.సత్యం, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నికృష్ణ కుటుంబానికి ఆర్థికసాయం

పోలాకి: మండలంలోని బొద్దాం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంటు గురివిల్లి చిన్నికృష్ణ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. సహ ఉద్యోగులు విరాళాలు సేకరించి ఆయన కుటుంబానికి బుధవారం పంచాయతీ కార్యాలయంలో రూ.1.50 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కె.కృష్ణారావు, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, ఎపిఒ రమణారావు, ఇసి గోవిందరావు, టిఎలు, ఎఫ్ఎలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీమా అందజేత

సంతబొమ్మాళి: మండలంలోని అంట్లవరంలో ముద్దాడ శ్రీధర్ ఇటీవల మృతి చెందారు. మృతుడి కటుంబానికి వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.పది వేలు సర్పంచ్ ప్రతినిధి కళింగపట్నం అప్పారావు, ఎంపిటిసి ప్రతినిధి శిమ్మ సోమేష్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వాలంటీర్ పాల్గొన్నారు.

ఘనంగా పోషణ వేడుకలు

ఇచ్ఛాపురం : గర్భిణులకు పౌష్టికాహారం అవసరమని వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్ అన్నారు. పట్టణంలో జగన్నాథ స్వామి ఆలయం వీధిలోని అంగన్వాడీ కేంద్రం బుధవారం పోషణ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మి, స్వాతి పాల్గొన్నారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

పలాస: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సూర్యతేజ జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ కామేశ్వరరావు, మాజీ ఎంపీ కణితి విశ్వనాథం అన్నారు. కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో బాగంగా బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. ఒక వ్యక్తి దానం చేసిన రక్తం సుమారు ఆరు మందికి ఉపయోగపడుతుందన్నారు. 50 మంది విద్యార్థులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో దానేటి కామేశ్వరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, హెచ్‌యు.దొర, వి.వెంకటరావు ఎల్.కొండలరావు, సత్యప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ పద్మజీ కామేశ్వరరావు

ప్రకృతి సేద్యంతో బెల్లం తయారీ


అవగాహన కల్పిస్తున్న రేవతి

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి సేద్యంతో సాగు చేసిన చెరకు నుం,ఇ రైతులు బెల్లం తయారీ విధానాలను ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తిగా ఎటువంటి ఎరువులు వాడకుండా బెల్లం తయారీ విధానం తయారు చేస్తున్నారని అన్నారు. స్వచ్ఛమైన, సహజ సిద్ధంగా తయారు చేసిన బెల్లాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం మార్కెట్ ధర కంటే 15 శాతం అదనంగా ఇచ్చి తీసుకువెళున్నారని పేర్కొన్నారు. ఇంకా భవిషత్‌లో ముమ్మందు చేపేనపేట, నిమ్మతొర్లవాడ గ్రామాల్లో ప్రకృతి సేద్యాన్ని ఇంకా ఎక్కువ మంది రైతులతో విస్తరింపచేస్తామని అన్నారు. తద్వారా బెల్లాన్ని మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర వస్తుందని తెలిపారు. దీనివల్ల రైతులకు ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. అనంతరం రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కెవికె కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి, కిరణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, జెడ్‌పిహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణిత పోటీల్లో ఒడియా విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కవిటి

సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ప్రతిభా పోటీల్లో మండలంలోని సహాలాలపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఒడియా విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు హరిశ్చంద్ర పాఢీ బుధవారం తెలిపారు. ఈ పోటీల్లో తమ విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు 4,5 స్థానాలు కైవసం చేసుకున్నారని అన్నారు. డిఇఒ జి.పగడాలమ్మ చేతులు మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పి.పుష్ప, వై.పద్మనాభం, కె.జ్యోతి, ఎస్.ఇందు, పి.గీతాంజలి, ఇ.రేష్మ, గణిత ఉపాధ్యాయుడు రుక్కు ప్రధాన్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్ పాఢి, బృందవన్ దొలై, ప్రసన్న లిమ్మాయి, త్రిలోచన పొల్లాయి, జి.హేమలత, లతకుమారి, పద్మాలత, జ్యోతి, కుమారి, సుదర్శన్ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు